క్లుప్తంగా

తెగిన కాల్వకు మరమ్మతు



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ గ్రామ సమీపంలో వర్షానికి తెగిన కేఎల్ఐ డీ–8, మేజర్ –6 కాల్వకు ఆదివారం మరమ్మతు చేపట్టినట్లు మాజీ ఎంపీటీసీ సభ్యులు సుబ్బయ్య యాదవ్ తెలిపారు. కాల్వ తెగి రైతుల పంటలు నీట మునిగిన విషయాన్ని నీటిపారుదల ఈఈ మధుసూదన్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి జేసీబీ, ట్రాక్టర్లు పెట్టి మరమ్మతులు చేయించండని చెప్పారు. మరమ్మతు ఖర్చులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పడంతో మరమ్మతు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట..



పాన్‌గల్: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలో దృశ్యమిది. ఆదివారం కురిసిన వర్షానికి వర్షపు నీరు నిలిచిపోవడంతో స్టేషన్‌లోకి వెళ్లేందుకు సిబ్బందితో పాటు పలువురు ఇబ్బంది పడ్డారు. స్టేషన్ సిబ్బందితో పాటు స్టేషన్ సమీపంలోని పలు గృహ యజమానులు ఈ దారిలో వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ దారి పక్కన డ్రైయినేజీలు లేకపోవడంతో, వర్షం వచ్చిన ప్రతిసారి ఇబ్బందులు తప్పడం లేదని కాలనీవాసులు, స్టేషన్ సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇబ్బందులు తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జంగిడిపురం, న్యూటౌన్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, వెంగళరావు కాలనీ, తదితర లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలను అప్రమత్తం చేయాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ముంపు ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య నీరు నిలిచింది. స్థానికులతో కలిసి ఇళ్ల మధ్య నిలిచిన నీటిని తొలగించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.

తప్పిన ప్రమాదం..




అమరచింత: పట్టణంలోని పశువైద్యశాల ఆవరణంలోని 11 కేవీ విద్యుత్ స్తంభంపై చెట్టు విరిగిపడటంతో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. విరిగిపడిన విద్యుత్ స్తంభం బరువుకు బిలకంటి రామ్మోహన్ శెట్టి ఇంటి ముందున్న విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉందని గమనించి లైన్‌మన్ రాజుకు సమాచారం ఇచ్చారు. వెంటనే వాటిని తొలగించి, వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. కురుస్తున్న వర్షాలకు పట్టణంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా తగు చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

కొత్తకోట రూరల్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణ కేంద్రంలోని 11వ వార్డులో ఓ పెద్ద చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. కౌన్సిలర్ స్పందించి మున్సిపల్ సిబ్బందితో చెట్టును తొలగింపచేశారు.

నాగులకుంట అలుగు ఉధృతి పరిశీలన



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద నాగులకుంట అలుగు ఉధృతిని ఆదివారం ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీఓ రఘురాములు పరిశీలించారు. అలుగు ఉధృతికి రోడ్డుపై ప్రవహించే నీటితో రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో జేసీబీ సాయంతో వరద నీటిని బ్రిడ్జి కిందకు మళ్లించి వాహనాల రాకపోకలను బ్రిడ్జి మీదుగా మళ్లించినట్లు పేర్కొన్నారు. భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్పా.. బయటకు ఎవరూ రావద్దని ప్రజలకు సూచించారు. చెరువులు, కుంటల్లో చేపల వేటకు ఎవరూ వెళ్లకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పరశురాం, కాంగ్రెస్ నాయకులు విష్ణు, హన్మంతు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లిలో పారుతున్న వాగు



పాన్‌గల్ మండలం శాగాపూర్ సమీపంలో..



పాన్‌గల్ మండలం కొత్తపేట-మాందాపూర్ మధ్యలో..

అతలాకుతలం..

- కూలిన మట్టిమిద్దెలు
- నిండిన చెరువులు
- శిథిల ఇళ్లలో ఉండొద్దని నోటీసులు ఇచ్చిన అధికారులు



అమరచింతలో కూలిన మట్టిమిద్దె



చంద్రగడ్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

అమరచింత: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జన జీవనం అంతా అతలాకుతలమైంది. రోజువారి కూలీ పనులు చేసుకుంటున్న కూలీలు పనులు లేక అవస్థలు పడ్డారు. వర్షాలకు ఇళ్ల నుంచి బయటకు ఎవరూ రాకూడదని అధికారులు గ్రామాల్లో టాంటాం వేయడంతో ప్రజలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా అవసరం మేరకు మాత్రమే బయటకు వస్తున్నారు. చంద్రగడ్‌లో మట్టి మిద్దె కూలడంతో తహసీల్దార్ రమేష్ రెడ్డి, ఎంపీడీఓ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలను సేకరించి, వారిని రక్షిత ప్రాంతాలకు తరలించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో అధికారులు పర్యటించి మొత్తం 29 ఇళ్లు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని ఖాళీ చేసి వెళ్లాలని ఇంటి యజమానులకు నోటీసులు ఇచ్చారు. దర్మాపురం, సింగంపేటలోని కుంటలు, చెరువు అలుగు పారాయి.

వర్షాలకు కూలిన మట్టి ఇళ్లు



వనపర్తి రాజపేటలో కూలిన మట్టి ఇల్లు

వనపర్తి రూరల్: కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని కడుకుంట్ల 02 , కాశింనగర్‌లో 02, అంకూర్‌లో 01, అచ్చుతాపురం 01, రాజపేటలో 01, పెబ్బేరు మండల కేంద్రంలో 01, అయ్యవారిపల్లిలో 01, సూగూరులో 01, కంచిరావుపల్లిలో 03 మట్టి ఇళ్లు కూలిపోయాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. శ్రీరంగాపురం మండలంలో తాటిపాములలో 05, శ్రీరంగాపురంలో 04, శేరుపల్లిలో 01 ఇల్లు పడిపోవడంతో తహసీల్దార్ మురళి, మండల ప్రత్యేక అధికారి నుషిత పరిశీలించారు. పంచాయతీ అధికారులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ.. ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బ్రాంచ్ కెనాల్ వద్ద మాట్లాడుతున్న పెద్దమందడి ఎస్ఐ శివకుమార్

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాల రైతులకు సాగునీరు బుద్దారం మీదుగా కేఎల్ఐ ద్వారా వస్తుండటంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భారీగా వరద నీరు వస్తుంది. బలిజపల్లి–జంగమాయపల్లి గ్రామాల సమీపంలోని బ్రాంచ్ కెనాల్ తెగిపోయింది. దీంతో సమీపంలోని ఈర్లచెరువు పూర్తిగా నిండింది. చెరువు సమీపంలోని అంకూర్ గ్రామాల ప్రజలను స్థానిక ఎస్ఐ శివకుమార్ అప్రమత్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కెనాల్ వద్దనే ఉండి స్థానిక రైతులతో మాట్లాడారు. వరద నీరు తగ్గే వరకు రైతులు, ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రోడ్డుపై కూలిన వృక్షాలు



పోలీసులతో కలిసి పరిస్థితిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఏపుగా పెరిగిన వృక్షాలు అకస్మాతుగా నేలకొరిగాయి. మూడు వృక్షాలు రోడ్డుపై నేలకొరుగుతుండటాన్ని గమనించిన వాహనదారులు దూరంగా వాహనాలు నిలపడంతో తృటిలో ప్రమాదం తప్పింది. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ పోలీస్ శాఖకు సమాచారం అందించి, నేలకొరిగిన వృక్షాలను తొలగించేందుకు జేసీబీలను తెప్పించారు. ఇందులో ఒక జేసీబీ మున్సిపాలిటీ నుంచి రాగా.. మరో జేసీబీని చీర్ల విజయచందర్ తన సొంత ఖర్చులతో తెప్పించి పనులు చేయించారు. అక్కడకు చేరుకున్న పట్టణ ఎస్ఐ జయన్న, రామరాజు వాహనాల రాకపోకల విషయంలో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు సతీష్, బి.వెంకటేష్, మన్నెంకొండ, రఘుపతి రావు, రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కాపలా..



గోవర్ధనగిరి గ్రామ కత్వ వద్ద గ్రామస్తులకు అప్రమత్తం చేస్తున్న తహసీల్దార్ వరలక్ష్మి

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలోని భీమా కాల్వకు గండి పడింది. గోవర్ధనగిరి కత్వతోపాటు గోపల్‌దిన్నె రిజర్వాయర్ అలుగునీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. పుల్గర్‌చర్లలో ఇటీవల నిర్మించిన డబుల్ సీసీ రోడ్డు నిర్మాణం లోతట్టులోని భాగ్యమ్మ, సీతమ్మ, బాలస్వామి ఇళ్లలోకి భారీగా వర్షపు నీరు చేరింది. మండలంలో ఉదయం నుంచి వివిధ గ్రామాలను పర్యటిస్తూ.. ప్రజలను అప్రమత్తం చేస్తున్న తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసారావు పుల్గర్‌చర్లలో ఇంట్లోకి చేరిన నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టారు.

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో చెరువులు, కుంటలు నిండి అలుగుపారాయి. గోపాల్‌పేట మండల కేంద్రంలోని అయోధ్యనగర్ సమీపంలో రోడ్డు మీదుగా నీరు పారింది. కేశంపేట గేటువద్ద ఎక్కువ మొత్తంలో నీరు పారగా పోలీసు రెవెన్యూ సిబ్బంది వాహనదారులకు జాగ్రత్తలు చెప్పారు. చెన్నూరులో ఓ ఇంట్లోకి వర్షం నీరు చేరింది.



చాకల్‌పల్లి రోడ్డులో మట్టిని తొలగిస్తున్న పోలీసు

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు



ఖిల్లాఘనపురం మండలం మల్కిమియాన్‌పల్లి వద్ద..

ఖిల్లాఘనపురం: మండలంలో శనివారం రాత్రి, ఆదివారం వాన దంచి కొట్టింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కమాలొద్దీన్‌పూర్, వెంకటాంపల్లి, షాపురం, అప్పారెడ్డిపల్లి, మామిడిమాడ తదితర గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలను అధికారులు నిలిపివేశారు. రోడ్లకు అడ్డంగా ముళ్లచెట్లు వేసి కాపలాకాశారు. కమాలొద్దీన్‌పూర్ బ్రాంచ్‌కెనాల్ అల్లమాయపల్లి వద్ద తెగిపోవడంతో నీళ్లు వరి పంటలపై పెద్ద ఎత్తున పారాయి. మల్కిమియాన్‌పల్లిలో కొప్పెట చెన్నయ్య తదితర రైతుల వరి పంటతో పాటుగా భూమికోతకు గురై వాగులో కొట్టుకుపోయింది. మోటార్లు, స్టార్టర్లు వాన నీటిలో కొట్టుకుపోయాయి. అప్పారెడ్డిపల్లి, ఖిల్లాఘనపురం తదితర గ్రామాల్లో వరి పంటలు నీటిలో మునిగాయి. ఆగారం, మామిడిమాడ, కమాలొద్దీన్‌పూర్, ఖిల్లాఘనపురం, మామిడిమాడ తదితర గ్రామాల్లో తదితర గ్రామాల్లో మొత్తం 11 ఇళ్లు కూలాయని, మండలంలో మొత్తంగా 15 సెంటీమీటర్ల వాన కురిసనట్లు అధికారులు గుర్తించారు. అప్పారెడ్డిపల్లి నుంచి ఖిల్లాఘనపురం వెళ్లే రోడ్డుకు పెద్ద వాగు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విరిగిపడింది. ఖిల్లాఘనపురంలోని శివశక్తి నగర్‌లో వాన నీరు నిలిచి రోడ్డు మొత్తం చెరువులను తలపించింది. ఆగారం రెడ్ల చెరువుకు కొందరు వ్యక్తులు గండి పెట్టేందుకు చూడగా గ్రామస్తుల సమాచారంతో పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. తహసీల్దార్ పాండునాయక్, ఇన్‌చార్జ్ ఎస్ఐ నరేష్‌కుమార్, ఆర్ఐ గణేష్ మండలంలోని గ్రామాల్లో తిరిగి ప్రజలను అప్రమత్తం చేశారు.

పాన్‌గల్‌లో 90.07 మి.మీ వర్షపాతం



పాన్‌గల్ మండలం కొత్తపేటలో వర్షానికి కూలిన ఇల్లు

పాన్‌గల్: మండలంలో 90.07 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని జమ్మాపూర్ సమీపంలో భీమా కాల్వకు గండిపడటంతో పలువురి రైతుల పంటలు నీట మునిగాయి. విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో పాటు జమ్మాపూర్–బుసిరెడ్డిపల్లి గ్రామా ల మధ్య ఉన్న రోడ్డు కోతకు గురైంది. మ ండలంలోని కొత్తపేటలో లక్ష్మారెడ్డికి చెందిన ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో..



ఆత్మకూర్ ఆస్పత్రిలో చేరిన నీరు

ఆత్మకూర్: ఆత్మకూర్‌లో మూడు, మండల పరిధిలోని గ్రామాల్లో మూడు నివాస గృహాలు కూలిపోయాయి. నదీ తీర ప్రాంతాలకు చెందిన గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని, పాత నివాస గృహాల్లో ఉండకూడదని తహసీల్దార్ రాజు, ఎస్ఐ నరేందర్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి తెలియజేశారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూంకు 9908442992, 9652061830 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో భారీగా వరద నీరు చేరింది. విషయం తెలుసుకున్న చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు సందర్శించారు.

నీట మునిగిన పంటలు



అంకూరు వద్ద రోడ్డుపై పారుతున్న నీరు

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో కేఎల్ఐ డీ-8 మేజర్ -6 కాల్వ కోతకు గురై పంటలు నీట మునిగాయి. గ్రామానికి చెందిన ఆకు నమోని నాగేషికి చెందిన రెండు ఎకరాలు, బద్దుల కృష్ణకు చెందిన ఎకరం వరినాట్లు పూర్తిగా కొట్టుకపోయాయి.

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో రంగసముద్రం రిజర్వాయర్ నీటి మట్టం పెరగడంతో గేట్లు తెరిచి నీటిని బయటికి వదిలారు. తాటిపాముల వీరసముద్రం చెరువు నిండి అలుగు పారుతుంది. పెబ్బేరు మండలంలోని సూగూరు నల్లచెరువు అలుగు పారి వరి పంటలు నీటిలో మునిగాయి. కృష్ణానదిలో నీటి ప్రవాహం పెరగడంతో నది బ్యాక్‌వాటర్‌తో రంగాపురం శివారులో లిక్కర్ కంపెనీకి వెళ్లే రోడ్డు నీటిలో మునిగిపోయింది. దీంతో వాహనాలను నిలిపివేశారు. మండలంలోని నదీతీర ప్రాంతాల గ్రామాలను తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ రవీంద్ర, ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి పరిశీలించారు.



పాన్‌గల్ మండలం శాగాపూర్‌లో నీట మునిగిన వరిపంట

గ్రామ పరిసరాలకు చెరువు నీరు



గడ్డబస్వాపురంలోని ఊరచెరువు నిండి ఊర్లోకి చేరిన నీరు

చిన్నంబావి: మండలంలోని గడ్డబస్వాపురంలో ఊర చెరువు నిండి గ్రామ పరిసరాలకు నీరు చేరడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గ్రామాన్ని మండల అధికారులు పరిశీలించారు. దాపుగా 7,000 ఎకరాల్లో వివిధ రకాల పంటలు నీట మునిగాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

జూరాల వద్ద పోలీసుల పహారా



జూరాల ప్రాజెక్టు వద్ద పహారా కాస్తున్న పోలీసులతో ఎస్ సురేష్

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యాటకులను అనుమతించడం లేదని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం సెలవు కావడంతో జూరాల ప్రాజెక్టు సందర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తుంటారనే సమాచారంతో ఉదయం నుంచే ప్రాజెక్టు వద్ద రహదారిని మూసి ఉంచి పర్యాటకులను అనుమతించడం లేదన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా.. ఎగువ నుంచి వస్తున్న వరదతో జూరాల వద్ద కృష్ణానది ఉగ్రరూపం దాల్చుతుందని ఎస్ఐ తెలియజేశారు. జూరాల బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టడానికి జాలర్లు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. జూరాల ప్రాజెక్టుపై గద్వాలకు వెళ్తున్న ప్రయాణికులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పుష్కర ఘాట్‌తో పాటు ఎడమ కాల్వ వద్ద చేప వంటకాల వద్ద పర్యాటకులు కాల్వలో దిగకుండా తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించామని చెప్పారు.

నేటి నుంచి మద్దలేశ్వరి మాత ఉత్సవాలు



మద్దలేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న పద్మశాలీ కులస్తులు

అమరచింత: పట్టణంలో వెలిసిన మద్దలేశ్వరి మాత ఉత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు దేవర కొండ లచ్చన్న తెలిపారు. ఆదివారం మద్దలేశ్వరి ఆలయంలో బండారు వేసి ఉత్సవాలను ప్రారంభించారు. సోమవారం బెల్లంపానకం, పలహారం కార్యక్రమంలో పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం తొలిబోనంతో అమ్మవారికి మొక్కులు చెల్లించి పొటేళ్లను బలి ఇస్తామన్నారు. బుధవారం రెండో బోనం సమర్పణతో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. పద్మశాలి కులస్తుల ఇంటి దేవతగా పూజలందుకుంటున్న మద్దలేశ్వరి మాత ఉత్సవాలను ప్రతి సంవత్సరం శ్రావణ మాసం ముగిసిన తర్వాత నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితని ఉత్సవ నిర్వాహకులు తెలియజేశారు.

బాధితులకు న్యాయం చేయాలి

కొత్తకోట రూరల్: అకాల వర్షాలకు మండలంలో కూలిపోయిన ఇళ్ల బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని మాజీ ఎంపీపీ గుంత మౌనిక డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పాతజంగమాయపల్లిని మాజీ ఎంపీపీ గుంత మౌనిక సందర్శించారు. గ్రామంలో తిరుగుతూ ఇళ్లు కూలిపోయిన నలుగురు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడారు. ఇల్లు కూలిపోయిన బాధితుల వివరాలను వెంటనే సేకరించి ఆదుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ వెంట వాకిటి బాలరాజు, గుంత మల్లేష్, పరమేష్, కృష్ణకుమార్, పరశురాం, సురేష్, కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాస శివరాత్రి ప్రత్యేక పూజలు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారు దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రావణమాసం మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం స్వామివారికి సహస్ర పుష్పార్చన, బిల్వార్చన, మహా మంగళహారతి ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

వనపర్తిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ తక్షణమే రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీజీఈజేఏసీ ప్రతినిధులు అశోక్, మద్దిలేటి డిమాండ్ చేశారు. పింఛన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని ఆదివారం టీజీఈజేఏసీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్ నుంచి బస్టాండ్ వరకు వర్షంలోనే ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో 2004, సెప్టెంబర్ 1న సీపీఎస్ అమలు చేసినందుకుగాను పింఛన్ విద్రోహ దినంగా జరుపుకొంటునట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా పాత పింఛన్ విధానాన్ని అమలు చేయకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశకు గురిచేస్తోందని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సభ్యులు రాజేంద్రప్రసాద్, సాయిచందర్, శ్రీనివాసరావు, టి.మహిపాల్‌రెడ్డి, వరప్రసాద్, బౌద్ధారెడ్డి, హరిప్రసాద్, అనిల్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్‌రూంను సద్వినియోగం చేసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో అధికారులు

ఆత్మకూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజు, ఎస్ఐ నరేందర్ అన్నారు. ఆదివారం మాట్లాడారు. కలెక్టర్ ఆదర్శ్‌సురభి, ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాలకు అనుగుణంగా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశామని చెప్పారు. రానున్న రెండు రోజుల్లో మండల పరిధిలో అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉంటే ఇల్లు ఖాళీ చేసి, వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని, పశువులను మేత కోసం వదలకూడదని, చెరువులు, కుంటల వద్దకు వెళ్లకూడదని, ముఖ్యంగా నదీతీర ప్రాంతాలైన మూలమల్ల, జూరాల, గుంటిపల్లి, మోట్లంపల్లి, ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి, రేచింతల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగినా.. ఎలాంటి సహకారం కావాలన్నా.. ఇక్కడి కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన 9908442992, 9652061830 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పేదలకు అండగా ఉంటాం..



పంచనామా చేయిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: ఇల్లు లేని నిరుపేదలకు, వర్షాల కారణంగా ఇల్లు కూలిపోయిన పేదలను ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. వనపర్తిలోని రాయిగడ్డలో ఆదివారం తెల్లవారుజామున వర్షానికి ఖాదర్ పాష అనే యజమాని ఇల్లు పైకప్పు కూలిపోయింది. అదేవిధంగా అదే కాలనీకి చెందిన బోయ మన్నెమ్మ ఇల్లు కూలిపోడంతో కాంగ్రెస్ నాయకుడు రాగి వేణుగోపాల్ విషయాన్ని చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబాలను పరిశీలించి ఇళ్లు కూలిపోయిన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.